సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జామ్ ఎంట్రన్స్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఐఐటీ జామ్ ఎంట్రన్స్ పరీక్షలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో రాజ్‌గిరి బంగారి, ఐఐటీ మద్రాస్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఎం.హేమలత సీట్లు దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ.వి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు అన్నాభిషేకం చేస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్ గాంధీ కాలనీలో షిర్డీ సాయిబాబా మహరాజ్ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పచ్చని కొమ్మలతో అలంకరించారు. బాబాను నూతన వస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.వి.రమణకుమార్, వ్యవస్థాపకురాలు ఉదయలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు.. స్వామికి అన్నాభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. పెదగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్ గాంధీ కాలనీ, క్రాంతినగర్, విజయదుర్గా కాలనీ, హనుమంతవాక, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

శిశుగృహ సందర్శన



ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ విజయ

మర్రిపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల(సీసీఐ)ను స్కీమ్స్ అధికారులు సందర్శించారు. అందులో భాగంగానే సోమవారం 53వ వార్డు మర్రిపాలెంలోని మహిళా శిశుగృహ కేంద్రం, మహిళా హాస్టల్‌ను సోమవారం స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ ఎ.విజయ సందర్శించారు. శిశుగృహ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వారి సంరక్షణ కోసం ఆరా తీశారు. పలు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రమణకుమారి, నోడల్ అధికారి శ్రీకళ, డీసీపీవో లక్ష్మి, పీవో(ఎన్ఐసీ) మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరం ప్రాంతానికి చెందిన ఎం.మోహన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై విశాఖ వెళ్తుండగా తొట్లకొండ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్ తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక యువకులు ప్రమాదాన్ని గుర్తించి మోహన్‌ను రుషికొండలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606



ఆంధ్రా యూనివర్సిటీలో పోలీసుల బందోబస్తు



నిర్మానుష్యంగా ఏయూ పరిపాలన భవనం పరిసరాలు

ఉత్కంఠకు నేడే తెర

- తుది లెక్కలతో కార్యకర్తలు, నాయకుల కుస్తీ
- బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్.. టెన్షన్

ఆరిలోవ : సాధారణ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమవుతున్నందున చివరి రోజైన సోమవారం వరకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లపై లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నుంచి వెలువడిన వివరాలతో పాటు పోలైన ఓట్లలో **తమకు పక్కాగా పడినవి పదే పదే లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపుపై అంచనాలతో సోమవారం సాయంత్రం వరకు నియోజకవర్గంలో పలు చోట్ల నుం**చి నాయకులు, కార్యకర్తలు బెట్టింగులు ఎవరిపై వేయవచ్చు.. ఎంత మొత్తం వరకు వేయవచ్చన్న అంచనాలతో డబ్బులు ఫణంగా పెడుతున్నారు. దీని కోసం ఒకటికి రెండు సార్లు ఆరా తీస్తున్నారు. ఫోన్ల ద్వారా కూడా తమకు తెలిసిన వారిని గెలుపు ఓటములపై అడిగి తెలుసుకుంటున్నారు. అడిగిన వారినే మళ్లీ మళ్లీ అడుగుతూ సంతృప్తి చెందుతున్నారు. దీనికితోడు తమ అభ్యర్థులు గెలవాలని చివరి ప్రయత్నంగా దైవాన్ని అభ్యర్థిస్తున్నారు. మొక్కుల పేరిట ఆలయాల ముందు కొబ్బరికాయలు పగులగొడుతున్నారు. ఇదిలా ఉండగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సైలెంట్ ఓటింగ్ తమ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను విజయ తీరాలకు చేరుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

బెట్టింగ్ రాయుళ్లలో బెంబేలు

ఎగ్జిట్ పోల్ సర్వేలలో స్పష్టత లేకపోవడంతో బెట్టింగ్ రాయుళ్లు బెంబేలెత్తిపోతున్నారు. తూర్పు నియోజకవర్గంలో పోలింగ్ జరిగిన మరుసటి రోజు నుంచే పందేలు జోరందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ, టీడీపీ గెలుపుపై రూ.కోట్లలో పందేలు జరిగాయి. దీంతో పాటు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు పైనా బెట్టింగ్‌లు కాశారు. శనివారం వెలువడిన సర్వేలు చూసిన పందెంరాయుళ్లు అయోమయంలో పడ్డారు. సర్వేలు భిన్నంగా ఉండడంతో ఇప్పుడు అందరి చూపు కూడా పక్కా లెక్కింపుపై పడింది.

	తూర్పులో ఓటర్లు	పోలైన ఓట్ల వివరాలు
పురుషులు	1,42,540	96,224
మహిళలు	1,49,646	1,04,324
ఇతరులు	20	15
మొత్తం	2,92,206	2,00,563

అటు నిశ్శబ్దం.. ఇటు సందడి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సోమవారం భిన్నమైన పరిస్థితులు ఒకే సమయంలో దర్శనమిచ్చాయి. ఏయూ సౌత్ క్యాంపస్ పరిసరాలు నిశ్శబ్దంగా ఉండగా.. నార్త్ క్యాంపస్ పరిసరాలు మాత్రం ఎన్నికల కోలాహలంతో కళకళలాడుతూ కనిపించాయి.

- మరికొన్ని గంటల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల ఫలితాలపై అన్ని వర్గాలలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సోమవారం దాదాపుగా వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్‌లు, కళాశాలలు, పరీక్షల విభాగం, గ్రంథాలయం పరిసరాలు, పరిపాలనా భవనం వంటివి సందడి లేవు. నిత్యం వర్సిటీకి వివిధ పనులపై వచ్చే విద్యార్థుల సంఖ్య సైతం తగ్గిపోయింది. వర్సిటీ రహదారులు, విభాగాలు బోసిపోయాయి.
- మరో వైపు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం, పరిసరాలు పూర్తిగా పోలీసులతో నిండిపోయాయి. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత చర్యలు చేపట్టడం, లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందితో సందడి వాతావరణం కనిపించింది. మంగళవారం ఉదయం ప్రారంభమయ్యే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం సోమవారం ఉదయం నుంచి వందలాది మంది పోలీసు సిబ్బంది చేరుకున్నారు. దీంతో ఇంజినీరింగ్ కళాశాల మైదానం, ప్రాంగణం పూర్తిగా సందడిగా కనిపించాయి.

అధ్వానంగా కల్యాణ మండపం పరిసరాలు



అధ్వానంగా ఉన్న కల్యాణ మండపం పరిసరాలు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పరిధిలోని జాలరి ఎండాడ కల్యాణ మండపం పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. శ్రీసీతారామ కల్యాణ మండపం పేరిట జీవీఎంసీ నిర్మించిన ఈ మండపం నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారింది. నిర్వహణ, పరిసరాలు పరిశుభ్రత లేకపోవడంతో అటు మత్స్యకారులు, ఇతరులు ఎవరూ ఈ కల్యాణ మండపాన్ని వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా కల్యాణ మండపం పరిస్థితిని చక్కదిద్దాలని కాలనీ వాసులు కోరుతున్నారు. జీవీఎంసీ జోన్-3 అధికారులు పర్యవేక్షించి నిర్వహణ చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దాం

- స్టీల్ సీఐటీయూ పిలుపు
- 14న రక్తదాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టీల్ సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ జూన్ 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యావరణ హితంగా జీవిద్దాం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాలభాను విద్యాలయంలో నగరంలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకో వైజాగ్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పూర్తి అవగాహన పెంచుకుని తమ తోటివారితోపాటు తల్లిదండ్రులకు దీని ప్రాధాన్యాన్ని తెలియజేయాలని కోరారు.

150 మంది విద్యార్థుల హాజరు

చిత్రలేఖనం పోటీల్లో 51 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శబ్ద, వాయు, జల కాలుష్యాల నివారణకు పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ చిత్రాలు వేశారు. చిత్ర కళాకారుడు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ డబ్బీరు ఉదయ భాస్కరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ జనరల్ నాలెడ్జ్ పెద్ద బాలశిక్ష పుస్తకాలను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి సునీల్‌రెడ్డి, సత్తి లలితారెడ్డి పంపిణీ చేశారు.

5న హాజరు కావాలి

ఉక్కు యాజమాన్యానికి ఆర్ఎల్‌సీ ఆదేశం

అగనంపూడి: ఉక్కు కార్మికుడు నాట్ర తాతారావుతో 29 సంవత్సరాలు పని చేయించుకుని, వచ్చిన జీతంలో నిబంధనల మేరకు పీఎఫ్ కోత విధించినా నెలవారి పింఛన్ చెల్లింపులో ఉక్కు యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తున్న తీరుపై రీజనల్ లేబర్ కమిషనర్ ఈ నెల 5వ తేదీన హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆదేశించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన తరువాత జాతీయ భద్రతా పెన్షన్ పథకంలో కనీస పింఛన్ చెల్లించాలి. అయితే ఈ విషయంలో ఉక్కు అధికారులు, ఈపీఎఫ్ అధికారుల ద్వంద్వ వైఖరిపై తాతారావు ఆర్ఎల్‌సీకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన 5న హాజరు కావాలని ఆదేశించారు. అలాగే దేవర అప్పలకొండ అనే వితంతువును ఆమె ఆధార్ కార్డు ఆధారంగా చేసుకుని విధుల నుంచి తొలగించడంపై కూడా ఉక్కు యాజమాన్యం హాజరు కావాలని ఆర్ఎల్‌సీ ఆదేశించింది.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ ఆర్.రాజేంద్రరావు (36) అదృశ్యమైన ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం వెలగవలసకు చెందిన రాజేంద్రరావు స్టీల్‌ప్లాంట్ యూనిట్‌లో పని చేస్తూ అక్కడి బ్యారక్స్‌లో ఉంటున్నారు. రాజేంద్రరావు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బ్యారక్స్ నుంచి లుంగీతో బయటకు వెళ్లిన రాజేంద్ర తిరిగి బ్యారక్స్‌కు చేరలేదు. దీంతో సీఐఎస్ఎఫ్ ఎస్ఐ అందించిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మహిళ ఆత్మహత్య

పీఎం పాలెం : వెన్ను నొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 7వ వార్డులోని మిధిలాపురి ఉడా కాలనీలో గల ఓ అపార్టుమెంటులో సింగిరెడ్డి రామాంజనేయ రెడ్డి కుటుబంతో నివసిస్తున్నారు. అతను నగరంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీలో ఉద్యోగం చేస్తున్నారు. తన తల్లి గంగాభవానీ (54) గదిలో లేదని విధి నిర్వహణలో ఉన్న అతనికి ఫోను వచ్చింది. వెంటనే ఇంటికొచ్చి తాను నివసిస్తున్న అపార్టుమెంట్ చుట్టుపక్కల వెతికాడు. ఫలితం లేకపోవడంతో మధ్యాహ్నం 12 : 30 గంటలకు తన తల్లి అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా వాంబేకాలనీకి సమీపంలోని మామిడితోటలో ఓ మహిళ చెట్టుకు ఉరి వేసుకున్న వార్త తెలియడంతో రామాంజనేయ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉరి వేసుకున్న మహిళ తన తల్లి గంగాభవానీగా గుర్తించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదగదిలికి వరద పోటు



వర్షపు నీటిలో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



పెదగదిలి వద్ద నిలిచిన వర్షపు నీరు

ఆరిలోవ: హనుమంతవాక నుంచి అడవివరం **వరకు విశాలమైన బీఆర్**టీఎస్ రోడ్డు ఉంది. ఎంత **వర్షం పడినా దీనిపై** ఎక్కడా నీరు నిలిచిపోకుండా **నిర్మాణం చేపట్టారు.** అయితే పెదగదిలి కూడలి **మాత్రం చిన్నపాటి వ**ర్షానికే జలమయమవుతోంది. **వర్షం కురిసినప్పు**డు పెదగదిలి, సింహగిరి **కాలనీ ప్రాంతాలలో** కొండవాలు నుంచి వచ్చిన **వరద నీరు ఈ కూడలి**లో నిలిచి చెరువును తలపిస్తోంది. **పక్కనే ఉన్న** పెద్ద గెడ్డలోకి వరద నీరు **పోయే డ్రైనేజీ వ్యవస్థ**ను అధికారులు ఏర్పాటు **చేయకపోవడంతో ఈ** సమస్య నిత్యకృత్యంగా **మారింది. వర్షం పడి** ఆగిపోయిన కొన్ని గంటల **వరకు ఈ కూడలిలో** నీటి ప్రవాహం తగ్గడం లేదు. ఈ నీటిలో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్‌టీఎస్ నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి. ఈ రోడ్డు వినియోగంలోకి వచ్చి సుమారు 10 ఏళ్లు దాటింది. అప్పటి నుంచి ఎదురవుతున్న ఈ సమస్యను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం, రాత్రి కురిసిన వర్షానికి ఆటోలు, కార్లు సగానికి పైగా మునిగిపోయేలా నీరు నిలిచిపోయింది. ప్రస్తుతం వర్షా కాలం ప్రారంభమైంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే పరిస్థితి ఉంది. దీంతో ఇక్కడ మరింత సమస్య తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వేట సన్నాహాల్లో మత్స్యకారులు



అప్పుఘర్‌లో వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ: వేట విరామం గడువు దగ్గరకు వస్తుండడంతో మత్స్యకారులు వేటకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చేపల వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా అప్పుఘర్, జాలరిపేటలో చాలా మంది మత్స్యకారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏటా వేట విరామం పాటిస్తుండడంతో రెండు నెలలుగా మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఈ నెల 15వ తేదీతో ఆ గడువు ముగియనుండడంతో చేపల వేటకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకునే పనిలో మత్స్యకార గ్రామాలు నిమగ్నమయ్యాయి. ఈ మేరకు 18, 19 వార్డుల్లో అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేటలో ఎక్కడ చూసిన మత్స్యకారుల సన్నద్ధత దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. గుంపులు, గుంపులుగా మత్స్యకారులు వలలు బాగుచేసుకుంటుండటంతో పాటు బోట్లు, ఇంజిన్లను సరిచేసుకుంటూ వేటకు సిద్ధమవుతున్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఇసుకతోట యూపీహెచ్‌సీ వైద్యాధికారి ప్రేరణ

మద్దిలపాలెం : మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రేరణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందన్నారు. దోమలు వృద్ధి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వై.వి.రత్నం, ఆరోగ్య కార్యకర్తలు పాతకోకిల శేషుబాబు, మళ్ల రామునాయుడు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పండుటాకుల పింఛన్ కష్టాలు



టౌన్‌కొత్తరోడ్డు యూనియన్ బ్యాంక్‌లో పింఛనుదారుల నిరీక్షణ

పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు బ్యాంకులకు పరుగులు తీశారు. జూన్ 1న పింఛన్లు అందకపోవడం... 2న ఆదివారం సెలవు కావడంతో 3న సోమవారం బ్యాంకుల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు క్యూ కట్టారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దయ వల్ల ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటి వద్దే నగదు అందించేవారని... చంద్రబాబు, అతని దత్తపుత్రుని కుట్రల వల్ల ఇలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు. వారిద్దరికీ మా ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నామని పండుటాకులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంక్ సిబ్బందిపైనా పని ఒత్తిడి పెరిగింది. – డాబాగార్డెన్స్



పింఛన్ కోసం బ్యాంక్ ముందు పడిగాపులు కాస్తున్న వృద్ధులు



ఏవీఎన్ కళాశాల ఇండియన్ బ్యాంక్ బ్రాంచి వద్ద పింఛన్ కోసం క్యూలో నిల్చున్న వృద్ధులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com